# మౌనగీతం

శ్రీ పిఠీసుంట రామచంద్రమూర్తి

గాలి చల్లగా వీస్తోంది...!

చెట్టు కొమ్మల చిగురుటాకులు, కన్నె మనసులో గుసగుసలు రెపరెప లాడుతున్నట్టుగా — అటూ ఇటూ ఊగిసలాడుతున్నాయ్...

ఆ కదలికలో అందం నిండి వున్నట్టుంది... ఆ సందడి అందమైన ప్రియురాలి వేడి నిట్టూర్పులా వుంది!...

జిలుగు ఊహల సందడిలో పడి — వెండి వెన్నెల ఏవో బాసలు చేసుకుంటోంది.. మల్లెలు ముసిముసిగా నవ్వు కుంటున్నాయి.

ఇదంతా వర్ణనా కాదు — వేదాంతం అంతకంటే కాదు!

సీత గురించీ, మాధవ్ గురించీ చెప్పాలంటే — ముందుగా అవన్నీ చెప్పాలి...

ఈ వాతావరణం అలుముకున్న ఆ ఊరు అంత పెద్దదీ కాదు... మరీ అంత చిన్నదీ కాదు! ఆ ఊళ్లో ఓ పెద్ద బడి వుంది. చిన్న గుడి వుంది... గుడికి కొంత దూరంలో యువజన మండలి కుర్రాళ్ల స్థాపించిన లైబ్రరీ వుంది...

ఆ రోజు రాత్రి...

వెన్నెలొచ్చిం తర్వాత సీత గుడికి వెళ్లి — ఇంటికి తిరిగి వస్తోంది... లైబ్రరీలో అంత వరకూ చదువుకున్న మాధవ్ కూడా అప్పుడే ఇంటికి బయల్దేరాడు... వెళ్ళిన ప్రదేశాలు వేర్వేరైనా వస్తున్న త్రోవ ఒక్కటే... చేరాల్సిన గమ్యమూ ఒక్కటే!...

ఇద్దరి కళ్లూ కలిసినట్టుగా... ఇద్దరి హృదయాలూ ఒకే ఆలోచన చేస్తున్నట్టుగా... దారిలో ఇద్దరూ కలిశారు... కలిసి నడుస్తున్నారు...!

సీతతో అలా కలిసి నడవటానికీ — నడుస్తూ కబుర్లు చెప్పటానికీ — ఇంకా చెప్పాలంటే ఆమెపై మనసు పడటానికీ — మాధవ్‌కి హక్కుంది...!

మాధవరావ్ — అంటే మాధవ్, సీతకి సాక్షాత్తూ మేనత్త కొడుకు.

'మేనత్త కొడుకూ ఓ మొగుడేనా?' — అని సీత ఎప్పుడూ అనుకోలేదు... ఆ మాటకొస్తే మాధవ్ తనకు మొగుడైతే బావుణ్ణని ఈ మధ్య మరీ మరీ కోరుకుంటోంది... మౌనంగానే ఆ దేవుణ్ణి పదే పదే వేడుకుంటోంది.

మాధవ్‌కి తండ్రిపోయి చాలాకాలం అయింది... తల్లిపోయి అయిదారేళ్లు అయ్యుంటుంది... అంతే!

చెల్లెలి కొడుకు కావటం చేత — అప్పట్లో ఎస్సెల్సీ చదువుతున్న మాధవ్‌ని జానకి రామయ్య — అంటే — సీత తండ్రి, చేరదీశాడు. పట్నం పంపించి పై చదువులు కూడా చదివించాడు. అయితే అతనికి సీతనిచ్చి పెళ్లి చేయాలన్న స్వార్థం ఆయనలో ఏనాడూ లేదు... అందుకు కారణం కూడా లేక పోలేదు!

మాధవ్ చదువు పూర్తయి అయిదారు నెలలయింది... ఉద్యోగం కోసం చాలా ప్రయత్నాలు చేశాడు... కానీ ఫలితం లేక పోయింది... అందుకు అతనిలో నిరాశలేదు... ఆశయం వుంది! అతనిలో నిస్పృహలేదు... ఆత్మ స్థైర్యం వుంది...!

ఉద్యోగం రానందుకు బాధపడలేదు. తనకున్న ఆస్థిని అమ్మేసి — ఏదైనా ఇండస్ట్రీ పెట్టాలనుకున్నాడు... స్వశక్తితో, జీవితంలో వున్నతిని సాధించగలననే ఆత్మవిశ్వాసం అతనికి వుంది! అందుకే ఆ విషయం మామయ్యకు చెప్పడు.

'ఉన్నదాన్ని అమ్ముకోవటం ఎందుకూ?' — అని అనాలని పించినా, 'ఉన్నతికి రావటానికే కదా!' — అని తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు జానకి రామయ్య.

అప్పట్నించీ ఏదో ఒకటి చెయ్యాలనే ప్రయత్నం లోనే వున్నాడు మాధవ్... ఆ ప్రయత్నంలోనే మర్నాడు హైదరాబాదు వెళ్ళబోతున్నాడు. వెళ్లే ముందు సీతతో తనివి తీరా మాట్లాడాలను కున్నాడు... అందుకే ఆమె గుడిలోంచి రాగానే — అనుసరించాడు.

వాళ్ళిద్దరూ — నిర్మానుష్యంగా వున్న ఆ మట్టి రోడ్డు మీద వెన్నెల్లో నడుస్తూ — పక్కపక్కగా నడుస్తున్నారు.

ఎంత నెమ్మదిగా నడుస్తున్నా ఇల్లు దగ్గర పడిపోతోంది...

"సీతా!"... పిలిచాడు మాధవ్.

ఆ పిలుపు కోసమే ఎదురు చూస్తున్నట్టుగా — క్షణం ఆగి, పరవశంతో అతనివైపు చూసింది సీత.

"నేను రేపు హైదరాబాద్ వెడుతున్నాను!... తెలుసుగా?" —అడిగాడు.

"ఉ!"

"అక్కడ ఓ నెల రోజులు ట్రైనింగుంటుంది... ఆ తర్వాత వచ్చేసి టౌన్లో స్వయంగా 'ఇండస్ట్రీ' పెట్టుకో వచ్చు!"

శ్రద్ధగా వింటున్నట్టుగా — అతని వైపే చూస్తూ నడుస్తోంది సీత...

ఇంకా ఏదో చెప్పాలనీ — అడగాలనీ అనుకున్నాడు మాధవ్. కానీ — అంతలోనే నాలుగడుగుల దూరంలో వాళ్ళ ఎత్తరుగుల ఇల్లు కనిపించింది. ఓ అరుగు మీద ఊరి పెద్దలతో ముచ్చటిస్తూ కూర్చున్న ఆరడుగుల ఆ

**ఇంకా ఏదో చెప్పాలనీ — అడగాలనీ అనుకున్నాడు మాధవ్. కానీ, అంతలోనే నాలుగడుగుల దూరంలో వాళ్ళ ఎత్తరుగుల ఇల్లు కనిపించింది. దాని ఓ అరుగు మీద కూర్చుని ఊరి పెద్దలతో జానకి రామయ్య కనిపించాడు.!**




జానుబాహువు జానకీ రామయ్య కనిపించా డు.. దాంతో — ఆ ఇంటి వైపు వస్తున్న వాళ్ళిద్దరి మధ్యా — దూరం కొంచెం పెరిగింది...

ఆ మర్నాడు పొద్దున్నే మాధవ్ ప్రయాణం!...

ఎప్పుడూ లేంది, ఆ రోజు ఎందుకో సీతలో ఆతృత ఎక్కువైంది... మాధవ్‌కి ఎదురు పడలేక — తనగదిలోనే అటూ ఇటూ తిరుగుతోంది...

అంతలోనే రిక్షా వచ్చినట్టు 'బెల్' చప్పుడు సూచించింది. గోడగడియారం — సమయాన్ని గుర్తు చేసినట్టు గంట కొట్టింది... అంత కంగారులోనూ, ఆ క్షణంలో, గడప దగ్గర నిలబడిన సీతవైపు, ఆమె కళ్ళల్లోకి చూశాడు మాధవ్...

సీతకూడా చూసింది...

రెండు మనసులు కలిసినట్టూ — ఇద్దరి చూపులూ ఒకే గాడిలో పడినట్టూ — ఇద్దరిలోనూ వింతైన అనుభూతి రవంత సేపు చక్కిలి గింతలు పెట్టింది.

నాలుగయిదు నిమిషాలు గడిచే సరికి—

రిక్షా సందు మలుపు తిరిగింది... తనమనసును మాధవ్ దోచుకెడుతున్నట్టు సీతకు అనిపించింది... ఆమె గుండెలు బరు వెక్కాయి...

అలా నెల రోజులు...!

విరహంలో వున్న సుఖాన్నీ — ఆ సుఖంలోని తియ్యదనాన్నీ చవిచూస్తూ నెలరోజులూ గడిపేసింది... ఊహాల ఊయలలో నెలరోజులూ ఊగి ఊగి ఆగి పోయినట్టుంది గతం!

ట్రైనింగ్ పూర్తి చేసుకుని మాధవ్ తిరిగి వచ్చాడు...

సీత మనసు — ఆనందం పెల్లుబికినట్టు — ఉరికొచ్చింది.

వసంతంలో మొక్కలు చిగుర్చి నట్టూ, కోర్కెల రెమ్మల మీద కోయిలలు గొంతెత్తి పాడుతున్నట్టూ — ఆమె మనసు ఆనందపు రెక్కల్ని విప్పుకుంది...

ఆ సాయంత్రం పనులన్నీ అయ్యాక — పెరట్లో జామచెట్టు క్రింద తీరిగ్గా కూర్చుని సన్న

జాజుల్ని మాలగా గుచ్చుతోంది సీత... వెనుకనించి నెమ్మదిగా వచ్చి— ఆమె కళ్లు మూశాడు మాధవ్... సీత గుండె ఝల్లుమంది... ఆ తత్తర పాటులో సూది వేలికి గుచ్చుకుని రక్తం చిమ్మింది... చటుక్కున ఆ వేలును వెనక్కి దాచేసుకుంది. అయినా మాధవ్ గమనించాడు... గబగబా తన చేతిరుమాలు తడిపి, ఆ వేలికి కట్టు కట్టాడు...

సీత సిగ్గుతో పారిపోయింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర — తనమనసులో మాటను మావయ్యకు చెప్పాడు మాధవ్.

"నాపరిస్థితి నీకు తెలుసుగా!... కట్నం కానుకలు ఇచ్చుకోలేను... మా కంటే మంచి సంబంధం వస్తే చేసుకుంటే మంచిదేమో ఆలోచించు!... నేనేం అనుకోను!" —అన్నాడు జానకి రామయ్య.

మాధవ్ మనసు చివుక్కుమంది...

"కట్నం కానుకలు కావాలని నేనేం కోరుకోవటం లేదు మావయ్యా!... ఆ మాటకొస్తే మనిషికి సుఖం డబ్బులో దొరకదు... మనసులో వుంటుంది... ఆ మనసులో మనసయ్యే మనువులో వుంటుంది... పెళ్లికీ డబ్బుకీ కాదు మావయ్యా ముడి పెట్టాల్సింది... మనసుకూ, మనసుకూ మూడు ముళ్లు వేయాలి!..." — ఆవేశంగా అన్నాడు మాధవ్...

ముందుగా తాను అలా అన్నందుకు నొచ్చుకుంటూ— మాధవ్ వ్యక్తిత్వాన్ని మెచ్చుకున్నాడు జానకి రామయ్య.

మేనల్లుణ్ణి దగ్గరకు తీసుకుని — ఆనందంగా గుండెలకు హత్తుకున్నాడు.

మర్నాడే పురోహితుణ్ణి పిలిచి ముహూర్తం పెట్టించాడు.

వైభవంగా సీతా మాధవుల పెళ్లి జరిగి పోయింది...

"ఇన్నాళ్లూ ఆ దేవుడు నీకేదో అన్యాయం చేశాడని ఆవేదన చెందేవాణ్ణి!... కానీ ఇవాళ ఆ దేవుడికి చేతులెత్తి మొక్కుతున్నాను తల్లీ!... దేవుడులాంటి మాధవ్ సహచర్యంలో నువ్ తప్పకుండా సుఖపడతావ్!.. అదృష్టవంతురాలివి!" —సీతను మాధవ్‌కి అప్పగిస్తూ మనసులో ఆమెను ఆశీర్వదించిన జానకి రామయ్య పై మీది కండువాతో చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకున్నాడు...

ఆ రాత్రి...

సీతామాధవుల ప్రేమపండే తొలిరాత్రి...

గాలి చల్లగా వీస్తోంది...

చెట్టు కొమ్మల చిగురుటాకులు — కన్నె మనసులో గుసగుసలు రెపరెప లాడుతున్నట్టు అటూ ఇటూ ఊగిసలాడు తున్నాయి.

ఆ కదలికలో అందం నిండవున్నట్టుంది... ఆ సందడి అందమైన ప్రేయసి వేడి నిట్టూర్పులా వుంది...

జిలుగు వూహల సందడిలో పడి — వెండి వెన్నెల ఏవేవో బాసలు చేసుకుంటోంది... మల్లెలు ముసిముసిగా నవ్వు కుంటున్నాయి.

మనసు కలలకు రూపం వచ్చినట్టు, పున్నమి వెన్నెల పరవశంతో కురుస్తూంటే—

డాబామీద, సన్నజాజి పందిరి కింద — తన ఒడిలో తలపెట్టుకుని పడుకున్న మాధవ్‌వైపు చేతిలో రాసింది సీత—

"నీకు కృతజ్ఞతలు చెప్పకోవాలంటే నాకు నోరు లేదు బావా!... మూగదాన్ని మరి!... నీ మంచి తనానికి జోహార్లు!"

అలా అతని చేతిలో రాస్తూంటే — ఆమె కళ్ళల్లో కన్నీరు మెరిసింది...

"మూగతనం శాపం కాదు సీతా!" — అంటూ ఆమెను దగ్గరగా— మరింత దగ్గరగా తీసుకుని, కనుపాపలపై చుంబించాడు మాధవ్...

వాళ్ళిద్దరి మధ్యకూ రాలేని చల్లగాలి — వసంత నగీతాన్ని ఆలపిస్తోంది. వాళ్లిద్దరి మనసులూ కలసిమెలసి పన్నీరు చిలికినట్టు— ఆకాశంలో అక్కడక్కడ చుక్కలు చూడ ముచ్చటగా కనిపిస్తున్నాయి!!

*



## అపర ప్రవరాఖ్యుడు

మా రామానికి ఈ మధ్యనే ఆర్టీసీలో కండక్టరుగా ఉద్యోగం వచ్చింది. రెండేళ్ళ నిరుద్యోగంతో విసిగి పోయి, దాన్నే కలెక్టరు ఉద్యోగంగా భావించి చేరి పోయేడు. ఆ తరువాత ఓ రెణ్ణెల్లు ఎక్కడా కనిపించ లేదు. కొత్త ఉద్యోగం కదా, బిజీగా వున్నాడేమో అని సరి పెట్టు కున్నాను.

మొన్న బజార్లో అను కోకుండా హోటలు దగ్గర కలిసాడు. మనిషి గుర్తు పట్టనంతగా మారి పోయాడు. మొహం అంతా పీక్కు పోయి, మాసిన గడ్డంతో జబ్బు మనిషిలా తయారయ్యాడు.

'ఏరా అలా ఉన్నావు! ఒంట్లో బాలేదా! ఉద్యోగం ఎలా ఉంది!' అని అడిగేను.

ఓ నిమిషం మౌనంగా వుండి "ఉద్యోగం మానేశాను మావయ్యా"! అన్నాడు నిర్లిప్తంగా.

"ఏరా, ఏమయ్యింది! ఎవరితోనన్నా తగాదా పడ్డావా! మళ్లీ తీసేశారా! నీవే రిజైన్ చేశావా" అన్నాను ఆత్రంగా.

రామం నీళ్ళు నములుతూ, సగం సిగ్గుతో, బిడియంతో చెప్పిన జవాబును కుదిస్తే ఇలా వుంది.

"నేనీ ఉద్యోగం చెయ్యలేను మావయ్యా! అందరి మధ్యా అభిమన్యుడిలా దూసుకు పోవాలి. ఎంత అందమైన అమ్మాయి చెయ్యి తగిలినా, భుజం రాసుకున్నా ఏమీ పట్టనట్టు వూరుకోవాలి. వాళ్ళకళ్ళల్లోకి చూస్తూ ఎక్కడి కెళ్ళాలి అన్న చచ్చు ప్రశ్న తప్ప మరో మాట అడగ కూడదు. ఈ ఉద్యోగానికి నాలాటి పాతికేళ్ళ కుర్రాళ్ళు పనికిరారు మావయ్యా. అరవై దాటిన వాడైనా కావాలి, అపర ప్రవరాఖ్యుడైనా కావాలి"

—భార్గవి. పి.రావు

పొగరు



